# బడి.. నిర్వహణ అస్తవ్యస్తం

- నానాటికి తగ్గిపోతున్న మధ్యాహ్న భోజనం నాణ్యత..
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- అరకొరగా స్టూడెంట్ కిట్ పంపిణీ
- ప్రభుత్వ పాఠశాలలపై కొరవడుతున్న ఉన్నతాధికారుల పర్యవేక్షణ




రామాపురం ప్రాథమిక పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతులకు బోధిస్తున్న దృశ్యం, బురాన్‌దొడ్డి హైస్కూల్‌లో వంటగది లేక ఆరుబయటే వంట

కోడుమూరు రూరల్/పాణ్యం: విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రభుత్వ బడుల నిర్వహణ గాలికొదిలేయడంతో విద్యార్థులు సౌకర్యాలు, విద్యకు దూరమవుతున్నారు. జగనన్న పాలనలో ఓ వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలలు నేడు చిన్నబోతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి అందే విద్యా కానుకలు ప్రస్తుతం కొందరికి మాత్రమే అందాయి. మిగిలిన విద్యార్థులకు వస్తాయో రావో కూడా తెలియని పరిస్థితి. దీంతో చేసేది లేక గత ఏడాది చదివిన విద్యార్థుల నుంచి పాత పాఠ్య పుస్తకాలను తెప్పించుకుని విద్యాకానుకలందని విద్యార్థులకు ఇప్పించారు. పేద విద్యార్థులంతా కడుపునిండా నాణ్యమైన పౌష్టికాహారం తినాలని ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనం పథకంలో రోజురోజుకు నాణ్యత తగ్గిపోతుంది. గతంలో మాదిరి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరీక్షించేవారు లేకపోవడంతో వంట ఏజెన్సీ సభ్యులు ఇష్టానుసారంగా వండిపెడుతుండడంతో విద్యార్థులు భోజనం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**వేధిస్తున్న టీచర్ల కొరత..**

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కొందరు పదోన్నతి,బదిలీలపై వెళ్లిపోయారు. దీంతో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లోని కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక ఒకే ఉపాధ్యాయుడు 2నుంచి ఐదు తరగతులకు బోధిస్తున్నారు. పాణ్యం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. మొత్తం 52 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. అత్యధికంగా కల్లూరు మండలంలో 40 మంది ఉపాధ్యాయులు లేరు. అలాగే శకునాల ప్రాథమిక పాఠశాలలో ఒక ఉపాధ్యాయురాలు బైరాపురం పాఠశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో అక్కడ రెండు తరగతులను ఒకే ఉపాధ్యాయుడు తరగతులు నిర్వహిస్తున్నాడు.

అలాగే పాణ్యం మండలం తమ్మరాజుపల్లె ప్రాథమిక పాఠశాలలో 128 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం ఇక్కడ ముగ్గురు ఉపాధ్యాయులే విధులు నిర్వహిస్తున్నారు. హెచ్‌ఎం ఇటీవలే పదవీ విరమణ చేశారు. దీంతో గోరుకల్లు నుంచి ఎంటీఎస్(మినిమమ్ టైం స్కేల్)కింద పని చేసే ఉద్యోగిని తమ్మరాజుపల్లెకు పంపిస్తున్నారు. అలాగే పాణ్యం మెయిన్ పాఠశాల, ఉర్దూ గోరుకల్లు ఒకటి చొప్పున ఖాళీలు ఉన్నాయి.

**ఏకోపాధ్యాయుడే దిక్కు..**

➡ గడివేముల మండలంలో ఏకోపాధ్యా పాఠశాలలు ఐదు ఉన్నాయి. బిలకలగుడూరు ఉర్దూ పాఠశాలలో 39 మంది విద్యార్థులు, ఆదే గ్రామంలోని స్పెషన్ పాఠశాలలో 16 మంది, గ్రంథివేముల ఎంపీపీ పాఠశాలలో 11 మంది, గడివేముల ఉర్దూ పాఠశాలలో 8 మంది, పాత పైబోగుల పాఠశాలలో 26 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఐదు పాఠశాలల్లో ఏకోపాధ్యాయుడే బోధిస్తున్నారు.

➡ పాణ్యం నియోజకవర్గంలో 288 ప్రభుత్వ పాఠశాలల్లో 58,764 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలు ప్రారంభమైన సుమారు రెండు నెలలు గడిచినా విద్యార్థులకు యూనిఫాం, విద్యా సామగ్రి కూడా సక్రమంగా పంపిణీ చేయలేదు. కొన్ని పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్ లేకపోవడంతో విద్యార్థులు కుళాయిలను ఆశ్రయిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ బోధనకు విద్యార్థులు దూరమయ్యారు.

➡ కోడుమూరు మండలంలో మొత్తం 54 పాఠశాలలుండగా, మొత్తం 9,713 మంది విద్యార్థులకు గాను, 373 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పదోన్నతులు, బదిలీల వల్ల కొందరు ఉపాధ్యాయులు వెళ్లిపోవడంతో ఆ స్థానాలన్నీ ఖాళీగా ఉన్నాయి. మండలంలోని రామాపురం, ఎర్రదొడ్డి, కొత్తపల్లె గోరంట్ల మెయిన్ ప్రాథమిక పాఠశాలల్లో టీచర్ల కొరత కారణంగా ఒకే ఉపాధ్యాయుడు రెండు, ఐదు తరగతుల విద్యార్థులకు విద్యను బోధిస్తున్నాడు.

➡ సి.బెళగల్ మండలంలోని మొత్తం 43 పాఠశాలలుండగా, మొత్తం 9,234 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మండలంలో 34 పాఠశాలల్లో 73 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

➡ గూడూరు మండలంలో మొత్తం 32 పాఠశాలలుండగా, 8,876 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. బదిలీలు, పదోన్నతులపై వెళ్లిన పాఠశాలల్లో మాత్రమే టీచరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

➡ కోడుమూరు మండలానికి 56,678 నోటు పుస్తకాలు మంజూరవ్వగా, బ్యాగులు 9058, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు 1,791, యూనిఫాం 13,876, బెల్ట్‌లు 10,670, షూలు 14,856, సాక్స్‌లు 29,712 మంజూరయ్యాయి.

➡ గూడూరు మండలానికి 27,596 నోటు పుస్తకాలు, బ్యాగులు 4,980, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు 708, యూనిఫాం 8,876, బెల్ట్‌లు 6,540, షూలు 8,982, సాక్స్‌లు 17,964 మంజూరయ్యాయి.

➡ సి.బెళగల్ మండలానికి 51,470నోటు పుస్తకాలు, బ్యాగులు 9,126, డిక్షనరీలు 1159, యూనిఫాం-0, బెల్ట్‌లు 7,029, షూలు 9,176, సాక్స్‌లు 18,352 మంజూరయ్యాయి.



గొల్లలదొడ్డి యూపీ స్కూల్లో మూడు తరగతులకు ఒక్కరే టీచర్ బోధిస్తున్న దృశ్యం

**ఉపాధ్యాయుల వివరాలు..**

| మండలం | పనిచేస్తున్న టీచర్లు | ఖాళీలు | ఏకోపాధ్యాయ పాఠశాలలు |
|---|---|---|---|
| కోడుమూరు | 373 | 36 | 3 |
| గూడూరు | 32 | 23 | 1 |
| సి.బెళగల్ | 34 | 73 | 00 |

**పాణ్యం నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు..**

| మండలం | ప్రభుత్వ పాఠశాలలు | విద్యార్థులు ఖాళీలు | ఉపాధ్యాయ |
|---|---|---|---|
| పాణ్యం | 46 | 4,838 | 06 |
| ఓర్వకల్లు | 48 | 6,329 | 04 |
| కల్లూరు | 84 | 14,762 | 40 |
| గడివేముల | 38 | 3,418 | 06 |



శరీన్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో చేతులు శుభ్రం చేసుకునే కుళాయి నీటిని తాగుతున్న విద్యార్థులు

**మంజూరైన వాటిని పంపిణీ చేశాం**

ప్రభుత్వం నుంచి వచ్చిన విద్యాకానుకలన్నింటినీ విద్యార్థులకు పంపిణీ చేశాం. పాత లిస్టు ప్రకారమే విద్యాకానులు వచ్చాయి. మండలంలోని చాలా పాఠశాలల్లో టీచర్ల బదిలీలు, పదోన్నతుల వల్ల ఖాళీలు ఏర్పడ్డాయి. అయినప్పటికీ విద్యాబోధనకు ఇబ్బంది రాకుండా అదనంగా ఉన్న చోటు నుంచి టీచర్లను ఆయా పాఠశాలలకు సర్దుబాటు చేసుకున్నాం.

– శరభయ్య, ఎంఈఓ, కోడుమూరు

## క్లుప్తంగా

### తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న డీటీ

పాణ్యం: మండల తహసీల్దార్‌గా నరేంద్రనాథ్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మైదుకూరు నుంచి బదిలీపై వచ్చారు. డీటీ రమాదేవి, ఆర్‌ఐ మహేశ్వరరెడ్డి, కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం, మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

### నీటిని క్లోరినేషన్ చేయాలి



పోలకల్‌లో సూచనలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్

సి.బెళగల్: ప్రజలకు క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని పోలకల్ గ్రామంలో పర్యటించి నీటి సరఫరా విధానాన్ని పరిశీలించారు. నదినీటి నేరుగా ప్రజలకు సరఫరా చేయకుండా క్లోరినేషన్ చేయాలని చెప్పారు. అలాగే క్లోరినేషన్ విధానాన్ని వివరించారు. మంచినీటి వనరుల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సర్పంచ్‌లు, పీఏస్‌లకు సూచించారు.

### విచారణ జరిపించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కల్లూరు: మండల పరిధిలోని ఎ.గోకులపాడు గ్రామంలో సర్వే నెం.87లోని మఠం భూమిని కొందరు తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి అమ్ముకున్నారని, దీనిపై విచారణ చేయాలని స్థానిక బీజేపీ నాయకుడు సోమశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం ఇచ్చారు. రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేసి దేవాలయ భూములు దేవాలయానికే చెందేలా చూడాలని కోరారు. బీజేపీ నాయకులు వీరప్ప, హేమసుందర్‌రెడ్డి, తారకేశ్వరరెడ్డి, మదన్ మోహనాచారి, రవికుమార్, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

### విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



విద్యార్థులతో ఎంఈఓ

ఓర్వకల్లు: మండలంలోని ఎస్.కొంతలపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేసినట్లు ఎంఈఓ ఓంకార్ యాదవ్ తెలిపారు. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, వెంకటలక్ష్మీ దంపతుల కుమారుడు ఆర్‌ఎస్‌ఐ నరసింహులు జ్ఞాపకార్థం విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం లక్ష్మీనరసయ్య, ఉపాధ్యాయుడు లోకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

### పంట నమోదు చేయించుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏఓ

కోడుమూరు రూరల్: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ప్రతి రైతు ఈ- పంటలో నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఏఓ రవిప్రకాష్ సూచించారు. సోమవారం కోడుమూరులో జరుగుతున్న పంట నమోదును పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను మాత్రమే క్షేత్రస్థాయిలో పర్యటించి నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

### నాటుసారా స్వాధీనం

కోడుమూరు రూరల్ : కృష్ణగిరి మండలం చిట్యాల గ్రామంలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి అడవి మాదన్న అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు సోమవారం తెలిపారు. మాదన్నపై కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ ఆలీబేగ్, సిబ్బంది అన్సర్‌బాషా, శంకర్‌నాయక్, విరుపాక్షిరెడ్డి, సువర్ణమ్మ పాల్గొన్నారు.

## మారని అధికారుల తీరు




సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ నిర్వహిస్తున్న డీటీ కృష్ణమూర్తి



మండల పరిషత్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్‌లో పాల్గొన్న ఎంపీడీఓ శకుంతల, అధికారులు

సి.బెళగల్: మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం – పీజీఆర్‌ఎస్) కార్యక్రమ నిర్వహణపై మండల అధికారుల తీరు మారడం లేదు. వాస్తవానికి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమ నిర్వహణ ఉంటుందని, కార్యక్రమానికి మండల అధికారులందరూ హాజరవ్వాలని తహసీల్దార్ కార్యాలయ అధికారులు పేర్కొంటున్నారు. అయితే తహసీల్దార్ కార్యాలయలంలో సరైన వసుతులు, సౌకర్యాలు లేవని, వీసీ సౌండ్ సమస్య ఉందని కొందరు అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో కార్యక్రమం ఏర్పాటు చేసుకుంటున్నారు. మరికొందరు అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ నిర్వహిస్తుండటంతో గ్రామాల నుంచి సమస్యలను తెలిపేందుకు వచ్చే ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం డీటీ కృష్ణమూర్తి పీజీఆర్‌ఎస్‌ను తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేయగా, ఏఓ మల్లేష్‌కుమార్, ఎంఈఓ ఆదామ్‌బాషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, సెరీకల్చర్ అధికారిని పద్మావతి, వీఆర్వోలు హాజరయ్యారు. అలాగే..మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీడీఓ శకుంతల, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, విద్యుత్ కార్యాలయ అధికారి శ్రీనివాసులు హాజరయ్యారు. మండలంలోని ఓ పాఠశాలకు చెందిన హెచ్‌ఎం ముగ్గురు అధికారులతో పని బడి కార్యక్రమానికి రాగా కార్యాలయాలకు తిరుగుతూ ఇబ్బందులు పడ్డారు. మరి కొందరికి సైతం ఇదే అనుభవం ఎదరవడంతో అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

## వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మృతి

నివాళులర్పిస్తున్న కోట్ల హర్ష, ఆదిమూలపు సతీష్, జూలకల్ భాస్కర్‌రెడ్డి (ఫైల్)

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ గూడూరు మండల కన్వీనర్ జూలకల్ భాస్కర్‌రెడ్డి (65) అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పిఎస్.అస్లాం, పోలకల్ ప్రభాకర్‌రెడ్డితో పాటు, స్థానిక నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు జూలకల్ చేరుకుని భాస్కర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. భాస్కర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. మండలంలో పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం శ్రమించారని కొనియాడారు.

### విధుల నుంచి మినహాయించాలి

సి.బెళగల్: వీఆర్‌ఏలకు తహసీల్దార్ కార్యాలయ నైట్ వాచ్‌మెన్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని వీఆర్‌ఏలు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ విజయశ్రీకి వినతి పత్రం ఇచ్చారు. వీఆర్‌ఏల సంఘం మండల నాయకులు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న వాచ్‌మెన్, అటెండర్, రికార్డు అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ ద్వారా అర్హతలు కలిగిన వీఆర్‌ఏలను పదోన్నతులతో నియమించేలా చూడాలన్నారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్, వీఆర్‌ఏలు వెంకటేష్, వెంకటరాముడు, భాస్కర్‌నాయుడు, దీనేశ్వరి, సుంకులమ్మ ఉన్నారు.

### అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఉప్పరి పరమేష్ (ఫైల్)

కోడుమూరు రూరల్: మండలంలోని క్రిష్టాపురం గ్రామానికి చెందిన రైతు ఉప్పరి పరమేష్ (50) తన కున్న నాలుగెకరాల్లో పంటలు సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. నాలుగైదేళ్లుగా వ్యవసాయం కలిసి రాకపోవడం, కుటుంబ అవసరాలు, ఇద్దరు కుమార్తెల వివాహాల కోసం రూ.30 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చేందుకు ఇటీవల రెండున్నర ఎకరాల పొలాన్ని సైతం అమ్మాడు. అయినప్పటికీ అప్పులు తీరకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన పరమేష్ ఈనెల 3న రాత్రి పురుగుమందు తాగగా, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య ఉప్పరి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న శాంతిరాముడు

పాణ్యం: కేవలం ఉద్యోగం కోసం కాకుండా ఉపాధి కల్పించే స్థాయిలో ఇంజినీరింగ్ విద్యార్థులు తయారవ్వాలని ఆర్జీఎం విద్యాసంస్థల అధినేత శాంతిరాముడు అన్నారు. సోమవారం ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంజినీరింగ్ చదివితే ఉద్యోగం వస్తుందన్న భావన పక్కనపెట్టి పరిశోధనలతో అనేక ఆవిష్కరణలు సమాజానికి అందించాలని ఆకాంక్షించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న కోయంబత్తూరుకు చెందిన బైట్స్ కంపెనీ సీఈఓ కార్తీక్ పలు విషయాలను విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, సుబ్రమణ్యం, డీన్ అశోక్ కుమార్, రామిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బకాయి వేతనాలు చెల్లించాలని వినతి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న శానిటేషన్ వర్కర్లు

కల్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు బకాయి వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, నగర నాయకులు సుధాకరప్ప కోరారు. సోమవారం శానిటేషన్ వర్కర్లతో కలిసి ఎంఈఓ-1 శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేధింపులు అధికమయ్యాయని చెప్పారు. పనిభారం తగ్గించాలని.. 150 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలని కోరారు. కె.సువార్తమ్మ, సంధ్యాదేవి, చిన్న మద్దమ్మ, బజారమ్మ, విజయలక్ష్మి, మరియమ్మ, సుశీల, జయలక్ష్మి, కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

### బస్సు సౌకర్యం కల్పించండి..



తహసీల్దార్ వెంకటేష్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల నుంచి కోడుమూరుకు వచ్చి చదువుకునే విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలంటూ ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి సోమవారం విద్యార్థినులతో కలిసి తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. రంగస్వామి మాట్లాడుతూ కొత్తపల్లె, గుండ్లమల్లాపురం, పోతుగల్లు, కృష్ణాపురం గ్రామాల నుంచి కోడుమూరుకు రోజుకు వంద మందికి పైగా విద్యార్థులు వచ్చి చదువుకుంటున్నారన్నారు. వీరంతా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాల్లో వస్తున్నారని, దీని వల్ల వ్యయప్రయాసాలతో పాటు, ఎప్పుడు ఏమి జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### సులభతర బోధన చేయాలి



విద్యార్థుల అభ్యసన సమర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

పాణ్యం: విద్యార్థులకు సులభతర బోధన చేయాలని ఎంఈఓ-2సుబ్రమణ్యం అన్నారు. సోమవారం ఆలమూరు ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని.. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల సమర్థ్యాలను పరిశీలించారు.

### గోరుకల్లులో 7 టీఎంసీలు

పాణ్యం: గోరుకల్లు జలాశయంలో 7 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ శుభకుమార్ శుక్రవారం తెలిపారు. పోతిరెడ్డిపాడు నుంచి విడుదలవుతున్న నీరు బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి ఎస్సార్‌బీసీ కాల్వ ద్వారా నీరు రిజర్వాయర్‌కు చేరుతోంది. ఇన్‌ఫ్లో 8,600 క్యూసెక్కుల నీరు వస్తుండగా బైపాస్‌కు 1,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. మిగిలిన నీటిని గోరుకల్లు నిల్వ ఉంచుతున్నట్లు తెలిపారు. బీసీఆర్ (బనకచర్ల క్రాస్ రెగ్యూలేటర్) నుంచి 10వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుందన్నారు.

### మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

ఓర్వకల్లు: మధ్యాహ్న భోజనం తయారీలో తప్పనిసరిగా మెనూ పాటించాలని ఎంఈఓ ఓంకార్ యాదవ్ అన్నారు. పాఠశాలల తనిఖీలో భాగంగా సోమవారం మండలంలోని ఎన్.కొంతలపాడు, హుసేనాపురం, హెచ్.కొట్టాల గ్రామాల్లోని పాఠశాలలను తనిఖీ చేశా రు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, పిల్లల హాజరు పట్టిక, విద్యార్థి కిట్లను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, వంట ఏజెన్సీలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన ఉండాలని, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచాలని సూచించారు. ప్రతి విద్యార్థికి విద్యాకానుక కిట్లు అందేలా చూడాలన్నారు.

### కృష్ణాష్టమి విశిష్టతపై ప్రచారం



కరపత్రాలను పంపణీ చేస్తున్న కమిటీ సభ్యులు

ఓర్వకల్లు: కృష్ణాష్టమి వేడుకను పురస్కరించుకుని నిర్వహించే ఊరేగింపు విశిష్టతపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు ప్రచారం నిర్వహించారు. సోమవారం ఇందూ జ్ఞాన వేదిక కల్లూరు కమిటీ ఆధ్వర్యంలో నన్నూరు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం మాట్లాడుతూ..పూర్వం కృష్ణాష్టమి వేడుకలను 11 రోజుల పాటు నిర్వహించే వారని, చివరగా చవితి రోజు ఊరేగింపుతో ముగించేవారని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు ఓబులేసు, ఈశ్వరయ్య, హర్షవర్ధన్, కళ్యాణ్, మద్దిలేటి, వరలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

### గుంతల రోడ్లుకు మరమ్మతులు చేయాలి

కల్లూరు: కల్లూరు వక్కెర వాగు బ్రిడ్జి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుధాకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం నగర కమిటీ సభ్యులు జి. ఏసు, శ్రీనివాసులు, సూర్యనారాయణ, మధు తదితర నాయకులు వక్కెర వాగు వెంట ఉన్న రోడ్లను పరిశీలించారు.

## తోటల సాగుకు రైతులు ముందుకు రావాలి



రైతులకు మొక్కలు అందజేస్తున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: ఉద్యాన పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. సోమవారం ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆయా గ్రామాల రైతులకు మంజూరైన మొక్కలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ, మాట్లాడుతూ.. పండ్లు, పూల తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందని చెప్పారు. రెండవ విడతలో భాగంగా మండలంలో 43 ఎకరాల్లో 34 మంది రైతులకు 6,639 పండ్లు, పూల మొక్కలు మంజూరయ్యాయని, అర్హులైన రైతులకు పంపిణీ చేశాని ఉపాధిహామీ ఈసీ పృథ్వీరాజ్ తెలిపారు. సీఓ సుధాకర్, టీఏలు మురళీమోహన్, గోవర్ధన్, రాజశేఖర్, ఉమామహేశ్వరి, నాగవేణి, రామశంకర్ ఉన్నారు.

### బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్



రెవెన్యూ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయశ్రీ

సి.బెళగల్: మండల నూతన తహసీల్దార్‌గా విజయశ్రీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు అర్బన్ తహసీల్దార్‌గా పనిచేస్తూ, ఎన్నికల బదిలీల్లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ అయిన ఆమె అక్కడి నుంచి సి.బెళగల్‌కు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధుల్లో చేరారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ నాగభూషణం, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, కార్యాలయ అధికారులు, సిబ్బంది, వీఆర్వోలు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె వారితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధులపట్ల బాధ్యతయుతంగా వ్యవహారించాలని, రైతుల సమస్యలను ఎప్పటికి అప్పుడు గ్రామస్థాయిలో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకొవాలని చెప్పారు.